

# ఆంబోతు

పారిజాతం పూలవాన కురుస్తూంది.

పూలన్నీ గౌనులోకి ఏరుకుంటూంది ఆ అమ్మాయి.

"మీ అమ్మెక్కడే కనిపించడం లేదూ?" అన్నాడు గోపాలం వేపపుల్ల నోట్లో ఒక పక్కకి తోస్తూ.

"ఎదవ సచ్చినోడా! నీకు కళ్ళు కనిపిస్తున్నాయంటరా!" రాధమ్మ నీళ్ళు తోడుతున్నదల్లా బొక్కెన నేలమీద దభీలుమని పడేసి ఆ చిన్నపిల్లను బరబరా లాక్కుపోయింది. "లాగు తొడుక్కోకుండా తిరగొద్దని ఎన్నిసార్లు చెప్పానే నీకు? దిక్కుమాలినదానా!" వీపుమీద ఒక్కటేసింది. పూలన్నీ కింద పడిపోయాయి. అమ్మాయి మళ్ళీ పూలు ఏరుకుంటూంది ఏడుస్తూనే.

"ఏంటే అంత ఇసురు? నీ మొగుడు ఎక్కడా కనిపించటం లేదు. బిజినెస్ ఎట్లా ఉందేమిటి?"

"ఎట్లా ఉంటే నీకెందుకు? నీ చావు నువ్వు చావరాదూ?"

"అంతొరకు వచ్చిందంటే నీ యవ్వారం! సర్లే, ఆ మాట మీదే ఉండు. ఎప్పుడూ పగలే ఉంటుందేమిటి? రాత్రవదా? నాతోటి పనడదా? సూస్తాలే."

రాధమ్మ బిందె చంకన పెట్టుకుని విసవిసా బయలుదేరింది. గోపాలం బావి దగ్గరకు పోయి బొక్కెనతో నీళ్ళు తోడుకుని ముఖం కడుక్కున్నాడు.

"తప్పండశ, తప్పండి. పాతర తప్పటానికి పది రోజులట్టేట్టుంది." గోపాలం కాళ్ళు కడుక్కుని

కండువాతో ముఖం, కాళ్ళు తుడుచుకున్నాడు. కూలీలు పాతరమీద మన్ను గుంజుతున్నారు.

పార్వతి మెల్లగా దొడ్లోకి పోయి తాటాకు దడి కానుకుని, "బాబాయ్... బాబాయ్" అంటూ రహస్యంగా పిలుస్తూంది. "ఒక్కసారి రా, బాబాయ్."

చంకన పిల్లాడు జారిపోతున్నాడు. కోటయ్య నులకమంచం అల్లుతున్నవాడల్లా తాడు వేలికి మెలిక వేసుకుని, "మళ్ళీ ఏం గొడవ వచ్చిందే?" అన్నాడు. కళ్ళజోడు ఒక పక్కకు జారిపోతున్నది.

"పాతర తవ్విస్తున్నాడు" పార్వతి గొంతు జీరపోయింది.

"నరసమ్మ ఇంట్లో లేదా?"

"ఉందిగాని, బాబాయ్ అత్తయ్య మీద గూడా చెయ్యి చేసుకునేట్లున్నాడు."

"ఆరి సన్నాసి! తెగించినట్లున్నాడు. ఆడికి బుద్ధెప్పుడొస్తుందంట?"

"ఆ దేవుడికే తెలియాలి! ముందు నువ్వు రాకపోతే ఒక్క గింజ కూడా మిగలదు!"

"నిన్నే గదంటే పాతరోసింది? అన్నీ నచ్చచెప్పితిని. మళ్ళీ ఏమొచ్చిందంట? పద." కోటయ్య మంచంకోడుకు నులక ముడేసి లేచాడు.

"రాత్రి డబ్బు కావాలన్నాడు, బాబాయ్. ఎక్కడినుండి తెచ్చేది? లేదంటే నానా రభస చేశాడు. నేను ఉంచుకుని ఇవ్వటం లేదని ఆయనకు అనుమానం. నా దగ్గర డబ్బెక్కడిది చెప్పు, బాబాయ్?" పార్వతి కళ్ళనీళ్ళు కొంగుకు అద్దుకుంటూంది.

"అయినదానికి, కానిదానికి కళ్ళనీళ్ళెట్టుకోకు." కోటయ్య తాటాకు దడి మీద నుంచి రాబోయాడు. పార్వతి వారించింది.

"బాబాయ్, నువ్వు అటు తిరిగి వీధిగుమ్మం నుంచి రా. ఈ దడిలోంచి వచ్చావంటే నేను పిలుచుకు వచ్చాననుకుంటాడు." కోటయ్య ఒక క్షణం తటపటాయించాడు. ఈలోగా పంది ఒకటి దడిలోనుంచి తాటాకును తోసుకుంటూ దూరిపోయింది. కోటయ్య కాలుకు తగిలింది.

"ఈ పందులొకటి!" కోటయ్య కసిగా ఆ పందిని ఒక్క తన్ను తన్ని వీధిలోకి వచ్చాడు.

"త్రాష్టపు వెధవ. చెడబుట్టాడు." కోటయ్య గొణుక్కుంటూ గుమ్మంలోకి వచ్చి కాండ్రించి ఉమ్మేశాడు.

"ఏంటి, మామయ్యా, ఉమ్మేస్తున్నావు? నోట్లోకి గింజేమన్నా వచ్చిందా? ఎట్లా?" గోపాలం గడ్డిమోపు మీద కూర్చున్నాడు. కాలుమీద కాలువేసుకున్నాడు.

"నువ్వుగింజ కాదురా, వెలక్కాయ వచ్చింది." కోటయ్య పళ్ళు పటపటా కొరికాడు.

"మరి మాటెట్లా వస్తోంది?" గోపాలం నవ్వుతూంటే కయ్యానికి కాలు దువ్వుతున్నట్లుగా ఉంది.

"సంతోషించాంలే తెలివి. ఏం పనిరా ఇది?"

"కనపట్టం లేదా!" గోపాలం పాతర వంక చూస్తున్నాడు.

"పాతర పిచ్చి వదల్లేదు. ఎవడు తవ్వమన్నాడురా మిమ్మల్ని?" కోటయ్య కూలీలను గదమాయించాడు. "పొండి అవతలకు."

కూలీలు మట్టి గుంజుతున్నవాళ్ళల్లా పారలొదిలేసి నిలబడ్డారు.

"ఎవర్రా మిమ్మల్ని కూలికి పిలిచింది? నేనా, ఆయనా?" గోపాలం కూలీలవంక చూశాడు. "తవ్వండి" అంటూ గట్టిగా అరిచాడు.

"ఏమిటా అరుపులు? మీరే గదంటరా - నిన్న ధాన్యం పాతరోసి పోయింది? ఈవేళ తవ్వటానికి వస్తారంటరా! కూలీ గింజలిస్తే తవ్వటమేనా? మంచీ చెడ్డా అక్కర్లే? సిగదరగ! ఒళ్ళు బలిసిందిరా మీకు!"

"'మామయ్యా, అళ్ళనేమనకు. రమ్మన్నాను, వచ్చారు."

"వస్తార్రా, వస్తారు. గింజలిస్తే పాతర తీస్తారు. కొంపలు తీస్తారు." కోటయ్య ముందుకు వచ్చాడు. "పొండి అవతలకు."

"తవ్వండశ .. ఎవడడ్డం వస్తాడో చూస్తాను. ఈ ఇల్లు నాది. ఈ పాతర నాది. తవ్వుకుంటాను, తార్చుకుంటాను. నువ్వెవరంట ఆపటానికి?" గోపాలం పంచ పైకి లాక్కుని బొడ్డులోకి దోపుకున్నాడు.

"ఏరా, కొడతావా, మీద కొస్తున్నావు?'

"మామయ్యా, నువ్వు అయినదానికీ కానిదానికీ తలెడుతున్నావు. మర్యాద దక్కదు - ఏటనుకున్నావో?"

"ఏంటిరా మర్యాద? మర్యాద తెలిసినవాళ్ళెవరన్నా తిండిగింజలమ్ముకుని పెళ్ళాం పిల్లల్ని పస్తులు పడుకోపెడతార్రా?" కోటయ్య చేతులు ఆడిస్తున్నాడు.

"వాళ్ళు పస్తులుంటే నువ్వెట్టి పోషిస్తున్నావా? ఎట్లా?" గోపాలం కండువా దులిపి భుజాన వేసుకున్నాడు. అప్పటిదాకా వరండాలో గుంజ పట్టుకుని నిలబడ్డ నరసమ్మ మెల్లిగా ముందుకు వచ్చింది.

"మా తగూల్లోకి మీరెందుకు, బాబూ? వేరే కూలీ చూసుకోండి. పొండి" అంది.

"ఈ ఇల్లు ఎవరిదే? ఈ ధాన్యం ఎవరిదే?" గోపాలం పాతరమీద వచ్చి నించున్నాడు! "అయితే నన్నీ గింజలు అమ్ముకుండా చేస్తారన్నమాట?"

"అన్నీ నీవేరా, అబ్బాయ్. ఇయ్యాల శుక్రారం. రేపు చూద్దాము గాని, ఇయ్యాల్టికి గమ్మునుండు."

"నీ తమ్ముడని ఊరుకున్నాగాని లేకపోతేనా? నలుగురిలో ఏమిటి దబాయింపు? మక్కెలిరగతందును.'' గోపాలం కారాలు మిరియాలు నూరుతున్నాడు.

"నీ ఇల్లు, నీ ఇల్లు అనటానికి సిగ్గులేదంటరా! పెళ్ళాం ఉసురు పోసుకుంటున్నావురా! బంగారం లాంటి పిల్లను నీ చేతిలో పెట్టినందుకు బాగా బుద్ధి వచ్చేట్టు చేశావురా. ఎందుకురా మనిషి జన్మెత్తావు? సిగ్గుండాలిరా."

"పెద్ద పెద్ద మాటలంటున్నావు. ఎవరికీ సిగ్గులేనిది?" గోపాలం గబుక్కున దడిలోనుంచి వాసాన్ని పీక్కుని వచ్చాడు. "నా పెళ్ళాం ఎవరూ - నువ్వా, అదా?" పార్వతి వంక చూశాడు. "అసలు నువ్వు మా గొడవల్లోకి ఎందుకు వస్తున్నావంట?"

"పార్వతిని పెంచిన పాపానికిరా. దాన్ని తీసుకునివచ్చి నీ మెడకు కట్టిన పాపానికిరా.' కోటయ్య కసిగా అన్నాడు.

'అయన్నీ ఇప్పుడెందుకులే - పోనీరా" అంది నరసమ్మ.

"నాకిచ్చి ఎందుకు పెళ్ళి చేశారు? కట్నం లేకుండా ఫ్రీగా దొరుకుతాననే గారంటీ!"

కోటయ్య కళ్ళలో నీళ్ళు తిరిగాయి. తన వదిన నీళ్ళాడి చచ్చిపోయింది. గుర్రపువాతం

అన్నారు. పట్నం తీసుకుపోలే బతుకుతుందన్నారు. పట్నం వెళ్ళాలంటే కృష్ణ దాటాలి. రాత్రి పడవ కట్టరు. ఏరు దూకుడుగా ఉంది. ఏటి ఒడ్డుదాకా బండి పోవాలి. నేలంతా బురద. జర్రున జారిపోతూ ఉంటుంది. బండి కట్టే రత్తయ్య ఇంటి దగ్గిర లేడు సినిమాకు పోయాడట. వాడికోసం హాలంతా వెతికారు. వాడు సినిమాకు పోలేదు. ఆ పేరు చెప్పుకుని పోయి ఎక్కడో తాగి పడి ఉంటాడు. బండి తనే కట్టుకుని బయలుదేరాడు. అన్నయ్య, వదిన బండిలో కూర్చున్నారు. పడవదాకా వెళ్ళేటప్పటికే వదిన కన్నుమూసింది. అన్నయ్య దుఃఖం ఆపలేకపోయాడు. ఇంటికి వచ్చిన తరవాత పార్వతిని జాగ్రత్తగా చూడమని చెప్పి మిలిటరీలో చేరటానికి వెళ్ళిపోయాడు అప్పటికీ, ఇప్పటికీ కబురు లేదు. ఆ పసిపిల్లను పెంచి పెద్దచేసి, అప్పకొడుకు, తెలిసిన సంబంధం గదా అని గోపాలానికిచ్చి పెళ్ళి చేశాడు. పార్వతి ఏం సుఖపడింది? ఒక్క పూట సరిగ్గా చూసుకోలేదు. గోపాలాన్ని ఒక దారికి తీసుకువద్దామని కోటయ్య చేసిన ప్రతి ప్రయత్నం విఫలమవుతూనే వచ్చింది. లోపల భగ్గుమని మండిపోతూంది. గోపాలం మీదికి దూకాడు. పార్వతి అడ్డుపడదామని ముందుకు వచ్చేటప్పటికి చీరె కొంగు కాలికి మెలికపడి ముందుకు పడింది. చంకలో పిల్లాడు జారిపడిపోయాడు. గోపాలం కలియబడ్డాడు.

"చంపేస్తున్నాడురో!" అంటూ నరసమ్మ కేకలు పెట్టింది. గోపాలం ఎడం చేత్తో పిల్లాడిని తీసుకుని వెళ్ళి వరండాలో కుదేశాడు కోటయ్య కండువా జారిపడిపోయింది. గోపాలాన్ని ఒక్క తోపు తోసేసి, "ఎంత మంచివాళ్ళ కడుపున ఎట్లాంటి వాడివి పుట్టావురా! థూ" అంటూ వెనక్కు, వెనక్కు నడుస్తూ వెళ్ళిపోయాడు.

గోపాలం వాసంకర్రను మోకాలుమీద పెట్టి రెండు ముక్కలుగా విరిచి దొడ్లోకి గిరవాటు వేశాడు. "జాగ్రత్త! బొమికలు విరిచేయగలను!" అన్నాడు. · వరండాలో పిల్లాడు గుక్కపెట్టి ఏడుస్తున్నాడు. గోపాలం మెల్లిగా పిల్లాడిని ఎత్తుకుని, పాతర మీదకు వచ్చి, ఒళ్ళో పెట్టుకుని కూర్చున్నాడు. మట్టిని పిసుకుతూ బెడ్డలు విసిరేస్తున్నాడు.

"ఏరా, దెబ్బ తగిలిందా?" పిల్లాడి ముఖం మీదకు పడుతున్న జుట్టు వేళ్ళతో పైకి దువ్వాడు. పిల్లాడు ఏడుపు మానాడు. చేయి పట్టుకుని పైకిపాకుతూంటే ఎత్తి భుజం మీద కూర్చోపెట్టుకున్నాడు. నెత్తిమీద చిన్నచేతులతో కొడుతూ కేరింతలు పెట్టాడు.

"ఇదంతా మనదిరా. ఆడెవడురా అడ్డెట్టటానికి? గింజలు తవ్వనియ్యడేం? ఈ పాతరంతా నేనొక్కణ్ణే తవ్వేయగలనురా...ఆఁ... ఏటనుకున్నాడో! ఈ ఇల్లు, ఈ వడ్లు, ఈ చెట్లు... ఇవన్నీ మనవిరా " గోపాలం గట్టిగా గాలి పీలుస్తూ చెపుతున్నాడు. పిల్లాడు ఆకాశం వంక చూశాడు. సూర్యకిరణాలు కొబ్బరిమట్టల్లోంచి తొంగిచూస్తున్నాయి.

"ఈ కొబ్బరి చెట్లు, ఈ ఆకాశం, ఈ సూర్యుడు... అన్నీ మనవేరా" అన్నాడు గోపాలం పిల్లాడి చేతులు తన మెడకు చుట్టుకుంటూ. నరసమ్మ కిటికీలోనుంచీ తొంగి చూస్తూంది. పార్వతి పక్కనే ఉన్నది.

"ఒసేవ్! గోపిగాడు చిన్నప్పుడు వాళ్ళ నాన్నమీద ఇట్లానే కూర్చునేవాడే" అంది. పార్వతి పెదిమల మీద చిరునవ్వు తొంగిచూసింది. నరసమ్మ కళ్ళలోకి చూసింది. మెల్లిగా గోపాలం దగ్గరకు వచ్చి పిల్లాడిని అందుకుని, "స్నానానికి నీళ్ళెట్టనా?" అంది.

"అన్నంలోకి ఏముందేమిటి?" గోపాలం మట్టి దులుపుకుంటూ లేచాడు.

"గింజలమ్ముకుంటే అన్నం గూడా ఉండేది కాదు" అంది పార్వతి

'ఆఁ... ఎందుకు ఉండదు? బాగానే ఉంటుంది. మీ బాబాయి దొడ్లో పాతర లేదేమిటి? ఆయనొక్కడే తింటాడా?"

"ఏమో?"

"ఏమిటా పరధ్యాన్నం? ఎక్కడ చూసి మాట్లాడుతున్నావు?" పార్వతి పొలాల్లోకి చూస్తోంది. తాటిచెట్టుకు ఆవు కట్టేసి ఉంది. తాడు గుంజుకుంటూంది. "అంబా!" అంటూ అరుస్తోంది.

"ఆవు ఎవరిదేంటి?" గోపాలం నవ్వుతున్నాడు.

"సుబ్బయ్యగారిదంట." పార్వతి అటే చూస్తోంది.

"ఆంబోతెక్కడే? కనిపించదు." గోపాలం పార్వతి వెంట నడుస్తున్నాడు.

"ఒళ్ళు కొవ్వెక్కి ఊర్లో ఎక్కడో తిరుగుతూ ఉండుంటుంది." పార్వతి విసవిసా నడిచింది.

"నువ్వేం బెంగడకు, ఎక్కడ తిరిగినా ఇక్కడకు వచ్చేస్తుందిలే."

"మధ్య నాకెందుకు బెంగ!" పార్వతి పిల్లవాడిని వరండాలో దించి లోపలకు పోయింది.

"ఏమిటే అంటున్నాడు అబ్బాయి?" నరసమ్మ పార్వతిని పలకరించింది.

"ఏమిటో అన్నాడు. నేను విన్నానేమిటి?" అంది పార్వతి బొక్కెనలోకి నీళ్ళు తోడుతూ.

"అడగటం నాదే పొరపాటు లేవే!" అంది నరసమ్మ.

పిల్లాడు మెల్లిగా అడుగులు వేసుకుంటూ బయటకు వచ్చాడు. ఆవుదూడని నులకమంచానికి కట్టేసినట్టున్నారు, మంచాన్ని లాక్కుపోతూ గంతులు వేస్తోంది. పిల్లాడి మీదకు వచ్చింది.

"పాలు తీయటం కాలేదేమిటి? దూడ నొదల్లేదు" అన్నాడు గోపాలం. పక్కింటి రాధమ్మ ఆవుకు గడ్డివేసి, పాలచెంబు పట్టుకుని లేచింది.

"నీకెందుకు?"

"ఆఁ ఏం లేదు. నువ్వు పాలు తీస్తుంటే చూట్టానికి సరదాగా ఉంటుందిలే... అందుకని."

"ఆడు రానీ... నీ సరదా తీరుస్తాడు."

"ఇప్పుడెక్కడొస్తాడు! బిజినెస్సు కావద్దూ? పెసర్లంక పోయాడటగా?"

"రేపొద్దుటికి వస్తాడేమో?"

"ఈ రేత్తిరికే వస్తానన్నాడు. అప్పుడు తేలుద్ది యవ్వారం."

"ఏటి తేలుద్ది! ఆ ముసలాడు అక్కడుండటమే మంచిది. చీటికి మాటికి ఇంటికి రావడం, చిక్కుల్లో పడడం ఎందుకు?" గోపాలం మంచానికి కట్టిన దూడను వదిలేసి పిల్లాడిని తీసుకున్నాడు. వాడు గోపాలం కాళ్ళకు చుట్టుకుని దూడ మంచం వదలగానే కేరింతలు కొడుతూ దాని వెంట పరుగెత్తాడు.

"భలే గిత్త దూడ. దీన్ని కూడా చక్కగా ఆంబోతుగా అచ్చోయిస్తే సరి."

"ఊరి కోటి చాలు... ఎళ్ళి నీ పని చూసుకో."

పార్వతి ఇంట్లోనుంచి దూకుడుగా వచ్చింది.

"అక్కడ నీళ్ళు చల్లారిపోతున్నాయి. పోయి స్నానం చెయ్యి" అంది పిల్లాడిని చంకన వేసుకుంటూ.

"ఎవరి వోటులో వాళ్ళుండాలి. కాని చోటికి వస్తే కాళ్ళు విరిగిపోతాయి."

"దూడను గుంజకి కట్టెయ్యరాదూ? ఊరి మీదికి వదిలెయ్యకపోతే?" అంది పార్వతి.

"గుంజకి కట్టెయ్యకుండా ఎవరు ఊరుమీదికి వదులుతున్నారో అందరికి తెలుసు!" అంది రాధమ్మ.

"తెలుసుద్ది... తెలుసుద్ది" అంది పార్వతి. "ఏటి చూస్తున్నావు? ఎళ్ళి నీళ్ళోసుకో. ఆడదానికి లేని సిగ్గు మగోడికి ఎక్కడనుండి వస్తుంది?"

గోపాలం నవ్వాడు. "నవ్వగానే సరికాదు" అంది పార్వతి. రాధమ్మ దూడను గుంజకి కట్టేసింది.

"ధైర్యాలుంటే ఆ అంబోతును కట్టెయ్యాలి. అప్పుడు తెలుస్తుంది" అంది రాధమ్మ వీధిలో పరుగెత్తుతున్న అంబోతును చూపిస్తూ. అంబోతు రోడ్డు దిగి తాడితోపుల వైపు పరుగెత్తింది. వెంకటయ్య కర్రపెట్టి మోదుతూ వెంట పరుగెత్తుతున్నాడు.

"ఏంటయింది?"

"ఏటవుద్ది? ఊరుకున్న కొద్దీ రెచ్చిపోతున్నాది."

"నారు తొక్కేస్తే ఊరుకునె. కుడితి తాగిపోతే ఊరుకునె. మొక్కజొన్నంతా నాశనం చేస్తే మాట్లాడలేదయ్యో. వెంకటయ్య అదిలిస్తే పొడవ్వచ్చింది. కూసింతలో కూతుర్ని తొక్కి చంపేసేటిది. అంతగాడికి ఎవరూరుకుంటారు?"

"వెంకటయ్య వెంటబడి కర్రపెట్టి బాదుతున్నాడు. అది పంటకాలువలు దూక్కుంటూ తాళ్ళచుట్టూ తిరుగుతూంది. చెట్టుకు కట్టిన ఆవు తెంచుకుని పారిపోయే ప్రయత్నంలో ఉన్నది.

"ఆబోతును కొడితే కళ్ళు.పోతాయి. ఆడిని ఆపమని చెప్పండి." సుబ్బయ్య పంచె పైకి కట్టుకుని పరుగెత్తుతున్నాడు. రాధమ్మ బయటకు వచ్చి నిలబడింది.

"ఆపండి. ఆపండి అని అరిచేటోళ్ళే గాని... ఇంతమంది మగోళ్ళున్నారు... పోయి ఆపరాదాంట?" అంది.

గోపాలం ముందుకు ఉరికాడు. గట్లు, తుప్పలు దాటుకుంటూ డొంక కడ్డంపడ్డాడు. వెంకటయ్యను అందుకున్నాడు.

"ఏంటయింది. అంత కోపంగా ఉన్నావు? ఊరుకో" అన్నాడు.

"పిల్ల సచ్చిపోయేది కొంచెమయితే. అచ్చోశాం గదా అని ఊరుకుంటే ఎవర్నీ బ్రతకనిచ్చేట్టు లేదు."

"ఇయ్యాల్టికి ఊరుకో. సుబ్బయ్య గొడవ చేస్తున్నాడు."

"సుబ్బయ్య కాదు, ఆ బెమ్మదేవుడొచ్చినా ఆగేది లేదు. దీని కాలు విరిచేసిపోతాను ఇయ్యాల." వెంకటయ్య నిప్పులు కక్కుతూ పరుగెత్తుతున్నాడు.

రాధమ్మ మొగుడు రమణయ్య తాటిచెట్టుమీద ఉన్నవాడు ఈ హడావుడికి కిందకు దిగి వచ్చాడు. చెట్టుకు గాటుపెట్టి వస్తున్నట్టున్నాడు. వెంకటయ్య ముందుకు వచ్చి, "ఆ కత్తిటియ్యి, దీన్ని నరికేస్తాను" అని ఆవేశంగా అంటున్నాడు. గోపాలం అడ్డుపడ్డాడు.

"మతి పోయిందా మీకు? ఏమిటా అఘాయిత్యం! పొండవతలకు" అన్నాడు ఎదురుగా నిలబడి. గోపాలాన్ని చూడగానే రమణయ్య ఎగిరిపడ్డాడు. "అడ్డం వస్తే నిన్ను పొడిచేస్తాను"

అన్నాడు. మీదకు ఉరికాడు. ఇద్దరూ కలిసి పంటకాలవలో పడ్డారు. దెబ్బలు ఎంత తప్పించుకున్నా ఒళ్ళంతా గీరుకుపోయింది. ఇద్దరినీ ఆపటం కష్టమయింది గోపాలానికి. "ఉండండెహె" అంటూ అదిలిస్తూ ఇద్దరినీ దూరం చేశాడు. ఆంబోతు ఎంతసేపటికి అక్కడా అక్కడా పరుగెత్తుతూంది గాని, తాటితోపు దాటిపోవటం లేదు. దూరంగా పోయి నిలబడింది. గోపాలం ముందుకు నడిచాడు. ఆంబోతు ముందు కాలితో మట్టి దువ్వేస్తూంది. రమణయ్య బుసలుకొడుతున్నాడు. ఒక క్షణం ఉండి ఆంబోతు ముందుకు ఉరికింది. వీళ్ళని తొక్కి చంపేసేదే. రమణయ్య చెట్టుపైకి గబగబా పాకాడు. వెంకటయ్య డొంకకు అడ్డం పడ్డాడు. ఆంబోతు రమణయ్య ఎక్కిన తాటిచెట్టును తలతో కొట్టింది. రమణయ్య అందలేదు. గోపాలం వంక చూసి గట్టిగా రంకె వేసింది.

వెంకటయ్యను మెల్లిగా బ్రతిమిలాడి వెనక్కు తీసుకువచ్చాడు గోపాలం. కోటయ్య వచ్చాడు. అంతా చూస్తూనే ఉన్నాడు. "నాలుగు తగలనివ్వాల్సింది" అన్నాడు.

"నీకెందుకు గొడవలు? పోయి మంచం అల్లుకో" అన్నాడు గోపాలం.

"ఏంటి, కోటయ్యా, నువ్వు కూడా అట్లా అంటావు? ఆంబోతును అట్లా బాదుతుంటే చూస్తూ ఊరుకుంటారా?" అన్నాడు సుబ్బయ్య.

"నీకు తెలియదులే" అంటూ కోటయ్య వెళ్ళిపోయాడు.

గోపాలం ఒంటికి దెబ్బలు తగిలిన చోట చూసుకుంటూ వచ్చాడు.

"ఆ చెట్టెక్కింది ఎవరు?" అంటూ రాధమ్మ అనుమానంగా అడిగింది.

"ఇంకెవరు? నీ మొగుడు రమణయ్యే" అన్నాడు గోపాలం.

"అయితే, ఊరు పోలేదేమిటి? నిన్న ఇంటికే రాలేదు. ఎక్కడ సచ్చాడో!" అంది రాధమ్మ నిట్టూరుస్తూ.

"ఎక్కడో తాగి పడుంటాడు" అన్నాడు గోపాలం ముందుకు అడుగేస్తూ. పార్వతి జనాన్ని తోసుకుంటూ ముందుకు వచ్చింది.

"మనిల్లు ఇటుంది. అటుగాదు" అంటూ రాధమ్మ వంక చురచుర చూస్తూ గోపాలాన్ని ఇంటివైపు నడిపించుకుని పోయింది. గోపాలం కొడుకు పాతర మీద కూర్చుని "ఇదంతా నాది. ఈ పాతర నాది" అంటూ గుప్పిళ్ళతో మట్టి తీసుకుని గంతులు వేస్తున్నాడు.

(ఆంధ్రప్రభ – 4, ఫిబ్రవరి, 1976)